క్లుప్తంగా

బడిబయట పిల్లల గుర్తింపు



వివరాలు నమోదుచేస్తున్న ఉపాధ్యాయులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని చెర్లపల్లి గ్రామంలో మంగళవారం బడిబయట ఉన్న బడీడు పిల్లలను గుర్తించేందుకు సీఆర్‌పీ రాజు, ఉపాధ్యాయురాలు సునీత, వెల్దుర్తి ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌లు పర్యటించారు. బడిబయట ఉన్న ఇద్దరు విద్యార్థులను గుర్తించి ఎర్రొళ్ల సునీతను కేజీబీవీ, శివచరణ్‌ను వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో చేర్పించారు. బడీడు పిల్లలను బడికి పంపేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

యూనిఫాం పంపిణీ

వెల్దుర్తి(తూప్రాన్): అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వరలక్ష్మి అన్నారు. మంగళవారం వెల్దుర్తి అంగన్‌వాడీ కేంద్రం-1లో ప్రభుత్వం పంపిణీ చేసిన యూనిఫామ్‌లను ఆమె పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నాగమణి, ఆయా శ్రావణి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ నేతల ఆందోళన



పిల్లుట్లలో బ్యానర్ తొలగించి నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజా పాలన బ్యానర్‌పై ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు ఫొటోలు పెట్టకపోవడంపై బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు ఆందోళన చేశారు. మండల పరిధిలోని పిల్లుట్లలో జరిగిన ప్రజాపాలన గ్రామ సభలో ఏర్పాటు చేసిన బ్యానర్‌పై ఎమ్మెల్యే, ఎంపీల ఫొటోలు పెట్టకపోవడం వారిని అవమానించడమేనని బీజేపీ మండలాధ్యక్షుడు రవి, బీఆర్‌ఎస్ నాయకులు చింత స్వామి, పోచగౌడ్ ఆరోపించారు. గ్రామసభలో ఏర్పాటు చేసిన బ్యానర్ తొలగించి నిరసన వ్యక్తం చేశారు.

అన్ని రంగాల్లో రాణించాలి

మనోహరాబాద్(తూప్రాన్): పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా పద్మశాలీ అధ్యక్షుడు జయరాములు అన్నారు. మంగళవారం పలు గ్రామాల పద్మశాలీ సంఘం అధ్యక్షులను ఎన్నుకున్నారు. మనోహరాబాద్, దండుపల్లి, కూచారం, జీడిపల్లి, ముప్పిరెడ్డిపల్లి, రామాయపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాల అధ్యక్షుడిగా జంజీరాల శ్రీనివాస్‌ను, ఉపాధ్యక్షుడిగా శ్రీధర్, కోశాధికారిగా అజయ్‌కుమార్, యూత్ విభాగం అధ్యక్షుడిగా గడ్డం శ్రవణ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యాదగిరి, జిల్లా సహాయ కార్యదర్శి రాజు, పద్మశాలీ సభ్యులు పాల్గొన్నారు.

టీచర్ల దాతృత్వం..



ఆర్థికసాయం చేస్తున్న హెచ్‌ఎం విజయలక్ష్మి

పాపన్నపేట(మెదక్): పదో తరగతి స్పెషల్ క్లాసుల్లో ఆకలితో ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ఇద్దరు టీచర్లు ముందుకొచ్చారు. మండలంలోని చీకోడ్ -లింగాయపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, చీకోడ్‌కు చెందిన అధ్యాపకుడు భూపాల్‌రెడ్డి మంగళవారం రూ.10 వేల చొప్పున మొత్తం రూ.20 వేలు తమ పాఠశాల విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో వక్త నవీన్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్రమణకు శ్మశాన వాటిక



వినతిపత్రం అందిస్తున్న యువకులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తి గ్రామశివారులోని హిందూ శ్మశాన వాటిక స్థలం రోజురోజుకూ కబ్జాకు గురవుతుంతోంది. దీంతో భవిష్యత్‌లో దాని ఆనవాళ్లు లేకుండా పోతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయం పేరిట కొందరు భూస్వాములు శ్మశానవాటికలో స్థలాన్ని జేసీబీల సహాయంతో చదునుచేయించి ఆక్రమిస్తున్నారని ఆరోపిస్తున్నారు. తాజాగా అందులోని కొంతభాగాన్ని జేసీబీ సహాయంతో మడులుగా తయారు చేయడాన్ని గ్రామ యువకులు ఖండించారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కృష్ణకు గ్రామ యువకులు మంగళవారం వినతిపత్రం సమర్పించి ఫిర్యాదు చేశారు.

గ్రామసభల్లో గందరగోళం

- టీ.మాందాపూర్‌లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో అర్హుల పేర్లు రాలేదని ఆగ్రహం
- రుద్రారంలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అవకతవకలపై ఆందోళన



నర్సాపూర్: నాల్గవ వార్డు సభలో పాల్గొన్న ప్రజలు

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజాపాలన గ్రామసభలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులను కాదని అనర్హుల పేర్లను ఎంపిక చేశారని మండలంలోని టీ.మాందాపూర్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని టీ.మాందాపూర్ గ్రామంలో ప్రజాపాలన గ్రామసభలో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాను గ్రామ కార్యదర్శి చదివి వినిపించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో చాలా వరకు భూమి ఉన్నవాళ్ల కుటుంబ సభ్యుల పేర్లు వచ్చాయని, భూమిలేని నిరుపేదల పేర్లు రాలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గ్రామసభలో గందరగోళం ఏర్పడి రసాభాసగా మారింది. రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్‌ఐ నారాయణగౌడ్, ఏఎస్‌ఐ లక్ష్మణ్ తమ సిబ్బందితో గ్రామస్తులను సముదాయించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటయ్య, ఎంపీడీఓ దామోదర్ పాల్గొన్నారు. మండలంలోని రుద్రారం గ్రామంలోను ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అర్హుల పేర్లు తప్పిపోయాయని గ్రామస్తుల ఆగ్రహం వ్యక్తం చేశారు.

కలెక్టర్ కార్యక్రమం రద్దు...

టీ.మాందాపూర్ గ్రామసభకు కలెక్టర్ వచ్చిన తర్వాతనే గ్రామసభను నిర్వహిస్తామని చెప్పిన అధికారులు 10:30 గంటలకు గ్రామసభను ప్రారంభించారు. కానీ గ్రామసభ రసాభాసగా మారడంతో కలెక్టర్ కార్యక్రమం రద్దు అయింది. ప్రజాపాలన గ్రామసభలపై ఇంటిలిజెన్స్ అధికారులు దృష్టి సారించారు.వారు సివిల్ డ్రెస్‌లో వచ్చి గ్రామసభల ద్వారా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై ప్రజల స్పందనను తెలుసుకునే ప్రయత్నం చేశారు.

ఎండలోనే వార్డు సభ

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని నాల్గవ వార్డులో మంగళవారం సభను ఎండలో ఏర్పాటు చేశారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు లేని కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు అధికారులు మున్సిపాలిటీలోని ఒకటి, మూడు, నాల్గు, 11వ వార్డుల్లో వార్డు సభలు ఏర్పాటు చేశారు. ఆయా వార్డుల్లో కమ్యూనిటీ భవనాలు, మహిళా భవనాల్లో వార్డు సభలు ఏర్పాటు చేయగా, నాల్గవ వార్డులో మాత్రం వార్డు సభను ఎండలో నిర్వహించారు. ప్రజలు ఎండలో నిలబడి తమ దరఖాస్తులను మున్సిపాలిటీ అధికారులకు అందజేశారు. అధికారులకు కనీసం కుర్చీలు సైతం మున్సిపాలిటీ అధికారులు కల్పించకపోవడం ఎంటని నాల్గవ వార్డు కౌన్సిలర్ ఎరుకల యాదగిరి ఆరోపించారు. వార్డు సభ కోసం అధికారులు ఎలాంటి వసతులు కల్పించలేదని, సభ కోసం కుర్చీలు, టేబుల్ తన ఇంటి నుంచి తెప్పించి,అధికారులకు వేయించానని ఆయన చెప్పారు.

దరఖాస్తులు చేసినా రేషన్‌కార్డులు రాలె..

కూకుట్లపల్లిలో జనం ఆగ్రహం



రెవెన్యూ అధికారిని నిలదీస్తున్న గ్రామస్తుడు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కూకుట్లపల్లి గ్రామసభ రసాభాసగా జరిగింది. మంగళవారం గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ పుణ్యదాస్ ఇతర అధికారులు గ్రామసభకు హాజరుకాగా పంచాయతీ కార్యదర్శి రమేశ్ రేషన్‌కార్డుల మంజూరు జాబితా చదివి వినిపించారు. దీంతో ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం వందకుపైగా దరఖాస్తు చేసుకుంటే కేవలం 25 మందికి మాత్రమే వచ్చాయని మిగతా దరఖాస్తులు ఏం చేశారని గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు మంజూరు చేస్తున్నారని, రైతు భరోసా తప్పుడు సర్వే చేశారని, ఇళ్లు లేని వారిని ఉన్నాయని చెప్పడం ఏమిటని వారు అధికారులను నిలదీశారు. దీంతో గ్రామసభలో గందరగోళం నెలకొంది. కార్యక్రమంలో నాయకులు కాంతారావు, ఇక్బాల్, వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా పేర్ల నమోదు

కోనాయపల్లి(పీటీ)లో గ్రామస్తుల ఆందోళన



రామాయిపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణ

మనోహరాబాద్(తూప్రాన్): ప్రభుత్వం రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ భరోసా, రైతు భరోసాపథకాల కోసం మంగళవారం అధికారులు చేపట్టిన గ్రామసభల్లో నిరసనలు, ఆందోళనలు ఎదురయ్యాయి. ప్రభుత్వం చేపట్టిన సర్వేల్లో లబ్ధిదారుల పేర్లను అధికారులు ప్రకటించడంతో గ్రామస్తులు నిరసన చేశారు. అసలు అర్హులను గుర్తించకుండా ఇష్టారీతిన పేర్లు ఎలా నమోదు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్‌కార్డుల్లో దరఖాస్తు చేసిన వారికి రాలేదని వాపోయారు. కోనాయపల్లి(పీటీ)లో ఇందిరమ్మ ఇండ్లు డబుల్ బెడ్రూం ఉన్నవారికి, బిల్డింగ్‌లున్న వారికి ప్రకటించారని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఎదుట ఆందోళన చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ గ్రామస్తులను ఆందోళన విరమింపజేశారు. దండుపల్లి, కోండాపూర్, పర్కిబండ, జీడిపల్లి, వెంకటాపూర్ అగ్రహారం గ్రామాల్లో సైతం నిరసనలు చేశారు.

నామమాత్రంగా గ్రామసభలు

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో మంగళవారం నూతన రేషన్‌కార్డులు మంజూరు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి గ్రామసభలు నిర్వహించారు. కాగా ఆయా పథకాల్లో లబ్ధిదారులకు సంబంధించి వచ్చిన వివరాలను గ్రామసభల్లో అధికారులు చదివి, వినిపించడం వరకే పరిమితమయ్యారు. జాబితాలో పేర్లు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆత్మీయ భరోసా జాబితాలో భూములు ఉన్నవారినే ఎంపిక చేశారని, ఈ విషయంలో అధికారులు విచారణ చేపట్టి అర్హులను గుర్తించాలంటూ శెట్టిపల్లికలాన్ గ్రామసభలో గ్రామస్తులు విన్నవించారు. కుటుంబంలో తల్లిదండ్రుల పేరిట భూములున్నా.. వారి కుమారులను ఆత్మీయ భరోసా కింద ఎంపిక చేశారని, కానీ గుంట జాగా లేని కౌలు రైతులను మాత్రం విస్మరించారని వాపోయారు.

ఇందిరమ్మ కమిటా.. కాంగ్రెస్ కమిటా.?

అధికారులపై అజ్జమర్రి స్థానికుల ఆగ్రహం

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రజాపాలన గ్రామసభలో అధికారులు ప్రకటించిన పలు పథకాల్లో అనర్హుల పేర్లు ఉన్నాయి. దీంతో అజ్జమర్రి గ్రామస్తులు ఇది ఇందిరమ్మ కమిటా.. కాంగ్రెస్ నాయకుల కమిటీయా అంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. మంగళవారం మండల పరిధిలోని అంతారం, సామ్లా తండా, బద్యాతండా తండాల్లో ప్రజాపాలన గ్రామసభలు ప్రశాంతంగా జరిగాయి. అజ్జమర్రి గ్రామంలో మాత్రం రసాభసాగా సాగింది. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో పూర్తిగా ఇళ్లు లేని వాళ్ల పేర్లు లేకపోవడం, అందుకు అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని సమాధానం ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. గతంలో ఉన్న కమిటీ సభ్యులే ఇందిరమ్మ కమిటీ సభ్యులుగా కొనసాగాలని గ్రామ ప్రత్యేకాధికారి రాజశేఖర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, ఎంపీడీఓ ఆనంద్‌లకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ఇందిరమ్మ ఆత్మీయ పథకంలో అర్హులుగా భూమి ఉన్న వారిని ఎంపిక చేయడం ఎంటని వాపోయారు. ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై గ్రామస్తులు కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు బాల్‌రాజ్, మల్లయ్య, శ్రీశైలం, నగేష, సత్యం, మల్లేశం, వీరాస్వామి, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి సీఎం కప్ క్రికెట్ పోటీలు



నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానం చదును చేయిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: తెలంగాణ సీఎం కప్ ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఈనెల 26 నుంచి నిర్వహిస్తున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అందుకు మైదానాన్ని చదును చేసే పనులు చేపట్టామని వివరించారు. పోటీల్లో పాల్గొన దలచిన క్రీడాకారులు ఎంట్రీ ఫీజు రూ.7999 చెల్లించి తమ టీం పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. కాగా ప్రథమ బహుమతి రూ.ఒక లక్ష 909లు, ద్వితీయ బహుమతి రూ.50వేల 909లు అందజేస్తామని వివరించారు. కాగా పోటీల్లో పాల్గొన దలచిన క్రీడాకారులు 94929 11704 మొబైల్ నంబరులో మరింత సమాచారం కోసం సంప్రదించాలని కోరారు. కాగా మైదానం చదును చేసే పనులు రిజ్వాన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పర్యవేక్షించారు.

ముగిసిన 'చాముండేశ్వరీ' వార్షికోత్సవాలు



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చాముండేశ్వరీ అమ్మవారి 42వ వార్షికోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. కార్యక్రమాల్లో ముందుగా ఆలయాల ఉత్సవాల్లో భాగంగా చాముండేశ్వరీ అమ్మవారి ఎదురుగా ఉన్న బ్రహ్మీ, కాళీ, వైష్ణవి అమ్మవారుల ఎదురుగా అఖండ దీపారాధన అనంతరం అర్చకులు మహాచండి హవనము, కుంకుమార్చన, మహానివేదన, పూర్ణాహుతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకొని, అమ్మవారి ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొన్నారని అర్చకులు తెలిపారు.

కూచారంలో యూత్ భవనం పరిశీలన



యూత్ భవనాన్ని పరిశీలిస్తున్న ఈఈ నర్సింలు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారంలో యూత్ భవనం పాక్షికంగా కూలిన వార్త సాక్షిలో ప్రచురితమైంది. దీంతో ఈ కథనానికి స్పందించి మండల ప్రత్యేక అధికారి, జిల్లా పీఆర్ ఈఈ నర్సింలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భవనం మరమ్మతులకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీరి వెంట పీఆర్ ఏఈ మధు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరీ ఆలయ ప్రాంగణంలో చాముండేశ్వరీ సేవా సమితి, శాక్త మండల్ ఆధ్వర్యంలో బాలాజీ ఆస్పత్రి సంగారెడ్డి వారి సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని డాక్టర్ శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. శిబిరానికి సుమారు 400 మంది రోగులు వచ్చారని, అవసరమైన వారికి బీపీ, షుగర్ పరీక్షలతో పాటు ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు సైతం నిర్వహించామన్నారు. ఉచితంగా ముందులు పంపిణీ చేశామన్నారు. అత్యవసర చికిత్స అవసరమున్న రోగులకు ఆస్పత్రికి రావాలని సూచించామన్నారు. కార్యక్రమంలో వైద్యులు శైలజ, వేణుగోపాల్, పవన్‌కుమార్, సందీప్‌రెడ్డి, శ్రావణి, అక్బర్, ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కోసం లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గ్రామసభలు నిర్వహించారు. పలువురు అధికారులు మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేర్చేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. ఎవరైన అర్హుల పేర్లు రాకపోతే మరల దరఖాస్తు చేసుకోవాలని వారు వివరించారు.



రేగోడ్(మెదక్): మర్పల్లి గ్రామసభలో మెదక్ ఆర్డీఓ రమాదేవి



పెద్దశంకరంపేట(మెదక్): ఆరేపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ రమాదేవి



శివ్వంపేట(నర్సాపూర్): పిల్లుట్ల గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ మైపాల్‌రెడ్డి



నిజాంపేట(మెదక్): నందగోకుల్ గ్రామంలో నాలుగు పథకాలపై గ్రామసభ



తూప్రాన్: మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికి దరఖాస్తు అందిస్తున్న గ్రామస్తులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): అధికారులకు ఇందిరమ్మ కమిటీ మార్చాలని వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

నాకు ఇల్లు ఇవ్వండి సారూ..

గ్రామసభలో మహిళ వేడుకోలు



కౌడిపల్లి(నర్సాపూర్): నాకు ఇల్లు ఇవ్వండి సారూ, నేను పూరిగుడిశెలో ఉంటున్న అంటూ మండలంలోని కూకుట్లపల్లి గ్రామానికి చెందిన చింతల వీరమ్మ అధికారులను వేడుకుంది. మంగళవారం గ్రామసభ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఆమె పేరులేకపోవడంతో దీనంగా వేడుకుంది. ప్రజాపాలనతో పాటు పలుమార్లు అధికారులకు ఇల్లు మంజూరు చేయాలని కోరింది. ఇటీవల జరిగిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో సైతం గుడిశె వద్ద తన ఫొటో తీసుకొని వెళ్లారు. అయిన ఇప్పుడు ఇల్లు మంజూరు కాలేదని చెప్తున్నారు అని ఎంపీఓను అడిగితే కౌంటర్‌వద్ద మరోసారి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

అపార్ నమోదుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మండల విద్యాధికారి సత్యనారాయణ

కొల్చారం(నర్సాపూర్): కొత్త జాతీయ విద్యా విధానం-2020కి అనుగుణంగా ప్రతీ విద్యార్థి గుర్తింపు కోసం వన్ నేషన్ - వన్ స్టూడెంట్ ఐడీ కోసం రూపొందించిన అపార్ నమోదు తప్పనిసరి అని మండల విద్యాధికారి సత్యనారాయణ సూచించారు. మంగళవారం రంగంపేట ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ సమావేశంలో హెచ్‌ఎంలకు, ఉపాధ్యాయులకు అపార్ నమోదుపై మండల కోఆర్డినేటర్ సంపత్ కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల హెచ్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్ సరఫరాతో అవస్థలు

నర్సాపూర్: పట్టణంలో కరెంట్ సరఫరాలో కొన్ని రోజులుగా తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో వినియోగదారులు అనేక అవస్థలు పడ్డారు. కరెంట్ ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితులు తలెత్తాయని అంటున్నారు. మంగళవారం ఉదయం నుంచి అనేక సార్లు కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని వినియోగదారులు వాపోయారు. ఉదయం నుంచి గంటల తరబడి కరెంట్ లేదని, రాత్రి సైతం సక్రమంగా లేదని ఆరోపించారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పంచాయతీ సిబ్బందికి దుస్తులు అందజేత

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని బూర్గుపల్లిలో గ్రామ పంచాయతీ సిబ్బందికి, పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, ఇతర సామగ్రిని ప్రజాప్రతినిధులు, అధికారులు అందజేశారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వారికి సామగ్రిని అందించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని వారు సూచించారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, పెరుమాండ్లగౌడ్, సత్యనారాయణరావు,ఏఈ రమేశ్, ఏఎస్‌ఐ సునీత, గ్రామకార్యదర్శి పాషా తదితరులు ఉన్నారు.

◆ సగర సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట గ్రామంలో మంగళవారం సగర సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. జిల్లా సగర సంఘం అధ్యక్షుడు సాయిలు, జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కు నగేశ్, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, అక్కన్నపేట గ్రామశాఖ అధ్యక్షుడు కృష్ణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

◆ అమ్మవారిని దర్శించుకున్న సీఐ

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంను తూప్రాన్ సీఐ రంగాకృష్ణ మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు కమలేశ్ తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

◆ బ్రహ్మోత్సవాల పత్రిక అందజేత

రామాయంపేట(మెదక్): పట్టణంలోని శ్రీకాళ గుట్ట మల్లికార్జునస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల పత్రికను యాదవ సంఘం సభ్యులు మంగళవారం మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్‌కు అందజేశారు. అనంతరం వారు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదగిరికి అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

◆ చేగుంటకు చేరిన రథయాత్ర

చేగుంట(తూప్రాన్): ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి ఎమ్మార్పీఎస్ నిర్వహిస్తున్న కళాకారుల రథయాత్ర మంగళవారం చేగుంటకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణలో ప్రభుత్వ వైఖరి తెలపాలని ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో సభ జరగనుందని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మాసాయిపేట యాదగిరి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మురళి, మండలాధ్యక్షుడు రామస్వామి, ఆగం, దశరథం, రాములుశంకర్, అశోక్ పాల్గొన్నారు.

◆ సంవిధాన్ గౌరవ అభియాన్

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ఏటిగడ్డ మాందాపూర్‌లో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ అభియాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండలాధ్యక్షుడు హరీశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పలు రకాలుగా అంబేడ్కర్‌ను అవమానించిందని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో దళిత మోర్చా నాయకులు రమేశ్, మాణయ్య, నాయకులు వెంకన్న, రామచంద్రయ్య పాల్గొన్నారు.

◆ మానసిక ఆరోగ్యంపై అవగాహన

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థులు మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే మురుగైన ఫలితాలు సాధించగలరని చిన్నశంకరంపేట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు టెలిమనస్‌లో భాగంగా విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగా, ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టెలిమనస్ ప్రోగ్రామ్ కౌన్సిలర్లు సుబూద్, ప్రణీత పాల్గొన్నారు.

◆ ప్రమాదాల నివారణకు కృషి

హవేళిఘణాపూర్(మెదక్): వాహనాదారులు వాహనాలు నడిపే సమయంలో ప్రమాదాలు జరగకుండా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని హవేళిఘణాపూర్ ఎస్‌ఐ సత్యనారాయణ అన్నారు. మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనాదారులు హెల్మెట్ ధరిస్తే అకస్మాత్తుగా ప్రమాదం జరిగిన సమయంలో ప్రాణాపాయం ఉండొదన్నారు. ఏఎస్‌ఐ సమియొద్దీన్, సిబ్బంది ఉన్నారు.

◆ జాతీయ సమైక్యత శిబిరంలో విద్యార్థులు

నర్సాపూర్‌రూరల్: కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా విశ్వవిద్యాలయంలో ఈనెల 15 నుంచి 21 వరకు జాతీయ సమైక్యత శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ శిబిరంలో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలైన బతుకమ్మ, పోతరాజు నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన శైలజ, డాక్టర్ సురేశ్ కుమార్ బృందానికి నాయకత్వం వహిస్తూ దేశంలోని పలు రాష్ట్రాల నుంచి హాజరైన వాలంటీర్లతో కలిసి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.